www.kalamjyothi.com
# కలంజ్యోతి
రేపటి కోసం
శనివారం 04.01.2025
పేజీలు 04

- సంక్రాంతిలోగా నాగ్ పూర్ - విజయవాడ కారిడార్ భూసేకరణ పూర్తి కావాలి
- అటవీశాఖ పరిధిలోని సమస్యలను వెంటనే పరిష్కరించాలి
- అటవీశాఖ, ఆర్ అండ్ బీ శాఖలు సమన్వయంతో ముందుకు వెళ్లాలి
- రీజనల్ రింగ్ రోడ్డు, ఆర్ అండ్ బీ, నేషనల్ హైవే ప్రాజెక్టులపై అధికారులతో సమీక్షలో సీఎం రేవంత్



# ఆర్ఆర్ఆర్ భూ సేకరణ పరుగులు పెట్టాలి

సీఎం రేవంత్‌రెడ్డి

2 లో

- నంది అవార్డు ఇచ్చి ఘనంగా సత్కరించిన మోక్షిత సేవా సమితి
- కళారంగానికి ఎనలేని సేవలు అందించిన అంజన్న : ఎమ్మెల్యే పాల్వాయి హరీష్
- తెలంగాణ ఉద్యమంలో ఎనలేని కృషి : అంతడుపుల
- నిరుద్యోగ కళాకారులకు వెన్నుదన్నుగా : అనుమోజు వెంకటేష్, కిరణ్




# దరువుకు నంది

# పకడ్బందీగా ఆపరేషన్ స్మైల్

## ఆపరేషన్ స్మైల్ ఇంచార్జ్ సబ్ ఇన్స్పెక్టర్ సాదిక్ హుస్సేన్

కలంజ్యోతి, నిర్మల్ : బాల కార్మిక వ్యవస్థ నిర్మూలనకు ఆపరేషన్ స్మైల్ కార్యక్రమాన్ని పకడ్బందీగా నిర్వహిస్తున్నట్లు ఆపరేషన్ స్మైల్ ఇంచార్జ్ సబ్ ఇన్స్పెక్టర్ సాదిక్ హుస్సేన్ తెలిపారు. ఆపరేషన్ స్మైల్ – XI కార్యక్రమంలో భాగంగా శుక్రవారం కలెక్టరేట్ సమీపంలోని ఐకె రెడ్డి చౌరస్తాలో మెకానిక్ దుకాణంలో సోదాలు నిర్వహించామన్నారు. ఇద్దరు మైనర్లు చట్ట విరుద్ధంగా పనిచేస్తున్నట్లు గుర్తించి వారికి కౌన్సిలింగ్ నిర్వహించి పాఠశాలల్లో చేర్పించడం జరిగిందని తెలిపారు. మైనర్లను పనిలో పెట్టుకున్న యజమాని అజీజ్ పై చట్ట ప్రకారం కేసు నమోదు చేసామన్నారు. చట్ట విరుద్ధంగా మైనర్లు పనిలో పెట్టుకుంటే యజమానులపై కఠిన చర్యలు ఉంటాయని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో బాలల పరిరక్షణ అధికారులు ఎస్ నరేందర్, సగ్గం రాజు, హెడ్ కానిస్టేబుల్ అబ్దుల్ జమీర్, కానిస్టేబుల్ లు ముత్యం, నరేష్, వజ్రమ్మ, ఇతర అధికారులు, సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.



కలంజ్యోతి
శనివారం 04.01.2025



### నర్సాపూర్ హైవేపై రోడ్డు ప్రమాదం

# ముగ్గురు దుర్మరణం

## పలువురికి గాయాలు

### క్షతగాత్రులను పరామర్శించిన కాంగ్రెస్ పార్టీ మెదక్ అధ్యక్షుడు ఆంజనేయులుగౌడ్

**కలంజ్యోతి, నర్సాపూర్ :**
హైదరాబాద్ లోని దుండిగల్ మీదుగా వెళ్లే నర్సాపూర్ రహదారిలో జరిగిన ఘోర రోడ్డు ప్రమాదంలో ముగ్గురు దుర్మరణం చెందారు. నర్సాపూర్ అటవీ ప్రాంత శివారు మేడాలమ్మ ఆలయం సమీపంలో హైదరాబాద్ వైపు వెళ్తున్న కారు అదుపుతప్పి రెండు ఆటోలను ఢీ కొట్టింది. ఈ ఘటనలో మేడ్చల్ జిల్లా కుత్బుల్లాపూర్ కి చెందిన మనీషా, మెదక్ జిల్లా రుస్తుంపేటకు చెందిన ఐశ్వర్య, మరో వ్యక్తి(సూరారం) మృతి చెందగా.. ఆరుగురికి తీవ్ర గాయాలయ్యాయి. వీరిని 108 వాహనంలో నర్సాపూర్ ఏరియా ఆస్పత్రికి తరలించి చికిత్స అందిస్తున్నారు.

### ఆంజనేయులు పరామర్శ

కాగా, ఆస్పత్రిలో చికిత్స పొంతుతున్న క్షతగాత్రులను మెదక్ జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు ఆంజనేయులు గౌడ్ పరామర్శించారు. ప్రమాదంలో మృతిచెందిన వారి కుటుంబ సభ్యులకు సానుభూతి తెలిపారు. వారి కుటుంబ సభ్యులకు మనోధైర్యాన్ని కల్పించారు. బాధిత కుటుంబాలను ప్రభుత్వం ఆదుకుంటుందని ఆయన భరోసా ఇచ్చారు. ఆయన వెంట నర్సాపూర్ మాజీ ఎంపీపీ జ్యోతి సురేష్‌నాయక్, ప్రస్తింపేట మాజీ ఎంపీటీసీ అశోక్, నాయకులు ఉన్నారు.






## ఆర్ఆర్ఆర్ భూ సేకరణ

# పరుగులు పెట్టాలి

**కలంజ్యోతి, హైదరాబాద్ :**
రీజినల్ రింగ్ రోడ్డుకు సంబంధించిన భూ సేకరణ ప్రక్రియను వీలైనంత త్వరగా పూర్తి చేయాలని అధికారులను సీఎం రేవంత్ రెడ్డి ఆదేశించారు. ఆర్ఆర్ఆర్, అర్అండ్‌బీ,నేషనల్ హైవే ప్రాజెక్టులపై శుక్రవారం సచివాలయంలో సీఎం సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా సీఎం.. నాగ్‌పూర్ - విజయవాడ కారిడార్‌కు సంబంధించి తెలంగాణ జిల్లాల్లో అసంపూర్తిగా మిగిలిన భూసేకరణ ప్రక్రియను సంక్రాంతిలోగా పూర్తి చేసేందుకు చర్యలు చేపట్టాలని సూచించారు.అటవీ శాఖ పరిధిలో ఉన్న సమస్యలను వెంటనే పరిష్కరించాలని ఆదేశించారు.అటవీశాఖ,ఆర్ అండ్ బీ శాఖలు సమన్వయంతో ముందుకు వెళ్లాలనీ, దీనికి ఆ రెండు శాఖల్లో ఒక్కో అధికారిని ప్రత్యేకంగా నియమించాలన్నారు.రెండు శాఖలు సమావేశమై సంబంధిత శాఖల పరిధిలోని భూసేకరణ ప్రక్రియను వేగంగా పూర్తి చేయాలని ఆదేశించారు.రాష్ట్రంలో ప్రతి గ్రామం నుంచి మండల కేంద్రానికి బీటీ రోడ్డు ఉండేలా చర్యలు చేపట్టాలని సీఎం సూచించారు.భవిష్యత్ అవసరాలకు అనుగుణంగా రోడ్డు వెడల్పు ఉండే విధంగా డిజైన్ చేయాలన్నారు.కొత్త గ్రామ పంచాయతీలతో సహా ప్రతి గ్రామం నుంచి మండల కేంద్రానికి [illegible] రోడ్డు ఉండాల్సిందేనని..ఇందుకు సంబంధించి విడతల వారీగా నిధులు విడుదల చేయాలని అధికారులను ఆదేశించారు. ఇక ఏ గ్రామానికి రోడ్డు లేదనే మాట వినబడొద్దని అన్నారు.




## బడుగు మహిళల ఆశాజ్యోతి సావిత్రిబాయి పూలే

### అదనపు కలెక్టర్ కిషోర్ కుమార్



**కలంజ్యోతి, నిర్మల్ :**
బడుగు మహిళల ఆశాజ్యోతి సావిత్రిబాయి పూలే అని, ఆమె సేవ ఎనలేనిదని అదనపు కలెక్టర్ కిషోర్ కుమార్ కొనియాడారు. ప్రముఖ సంఘ సంస్కర్త సావిత్రిబాయి పూలే జయంతి వేడుకలను శుక్రవారం కలెక్టరేట్ లో ఘనంగా నిర్వహించారు. సమావేశ మందిరంలో జరిగిన ఈ కార్యక్రమంలో సావిత్రిబాయి పూలే చిత్రపటానికి అదనపు కలెక్టర్ కిషోర్ కుమార్, ఇతర జిల్లా అధికారులు పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు.ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ మాట్లాడుతూ అట్టడుగు వర్గాల అభ్యున్నతికి కృషి చేసిన మహనీయురాలు సావిత్రిబాయి పూలే అని కొనియాడారు. అనేక ఆంక్షలతో కూడిన నాటి సమాజం లోనూ తన భర్త జ్యోతిరావు పూలే ప్రోత్సాహంతో సావిత్రిబాయి చదువు నేర్చుకుని ఉపాధ్యాయురాలు అయ్యారని గుర్తు చేశారు. విద్యను అభ్యసిస్తేనే స్త్రీ విముక్తి సాధ్యమవుతుందని గ్రహించిన సావిత్రిబాయి, సాటి మహిళలను విద్యావంతులుగా తీర్చిదిద్దాలనే సంకల్పంతో బాలికల పాఠశాలలను ప్రారంభించి మహిళా చైతన్యానికి బాటలు వేశారని, తద్వారా ఆధునిక భారతదేశంలో మొట్టమొదటి మహిళా ఉపాధ్యాయురాలిగా కీర్తి గడించారని అన్నారు. ఆనాటి ఆధిపత్య వర్గాల సామాజిక కట్టుబాట్ల కారణంగా ఎన్ని అవాంతరాలు ఎదురైనా, వాటిని లెక్కచేయకుండా మహిళల విద్యాభివృద్ధికి అకుంఠిత దీక్షతో కృషి చేసిన ధీశాలి సావిత్రిబాయి పూలే అని ప్రశంసించారు. ఆ మహనీయురాలి స్ఫూర్తితో మహిళల అభ్యున్నతి కోసం కృషి చేయాలని, అప్పుడే ఆమె ఆశయ సాధనకు కృషి చేసినట్లు అవుతుందని అన్నారు. సావిత్రిబాయి సేవలను గుర్తించిన రాష్ట్ర ప్రభుత్వం ఇకనుండి ఆమె జయంతిని పురస్కరించుకుని ప్రతియేటా జనవరి 3 వ తేదీన మహిళా ఉపాధ్యాయ దినోత్సవం నిర్వహించాలని ప్రభుత్వం నిర్ణయించిందని తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా విద్యా శాఖ అధికారి రామారావు, సిపిఓ జీవరత్నం, డిఆర్డిఓ విజయలక్ష్మి, జిల్లా వెనుకబడిన తరగతుల అధికారి శ్రీనివాస్, పరిశ్రమల మేనేజర్ నరసింహా రెడ్డి, ఏవో సూర్యారావు, ఇతర అధికారులు, సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

# దరువుకు నంది

**కలంజ్యోతి, కుత్బుల్లాపూర్ :**
తెలంగాణ ఉద్యమంలో ప్రతి పల్లె పల్లె తిరిగి ఉద్యమానికి ఊతమిచ్చింది దరువు అంజన్న అని, 1994 లో మొదలైన అంజన్న ఉద్యమ ప్రస్థానం నేటికీ పీడిత తాడిత హక్కులకై కొనసాగుతూనే ఉందని, తెలంగాణ ఉద్యమంలో ఆడి పాడి తెలంగాణను తీసుకురావడంలో కీలక భూమిక పోషించిన అంజన్న, నేడు నిరుద్యోగ కళాకారులకు న్యాయం జరగాలని, వారికి ఉద్యోగాలు రావాలని వారికి వెన్నుదన్నుగా నిలుస్తున్న అంజన్న ను నంది అవార్డు ఇచ్చి సత్కరించుకోవడం మా అదృష్టంగా భావిస్తున్నామని మోక్షిత సేవా సమితి ఫౌండర్ సంతోష్ తెలిపారు, కొమురం భీం ఆసిఫాబాద్ జిల్లా కాగజ్ నగర్ లో జరిగిన నూతన సంవత్సర వేడుకలను పురస్కరించుకొని నేషనల్ నంది అవార్డు పురస్కారాలలో భాగంగా దరువు అంజన్నకు నంది అవార్డు ఇవ్వడం జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా విచ్చేసిన స్థానిక ఎమ్మెల్యే పాల్వాయి హరీష్ మాట్లాడుతూ, దరువు అంజన్న పటిమను తెలంగాణ ఉద్యమంలో చూస్తూనే ఉన్నానని, తెలంగాణ తీసుకురావడంలో అంజన్న పాత్ర గణనీయమైనదని, మారు మూల ప్రాంతం సిద్ధిపేట జిల్లా రాయపోల్ గ్రామంలో జన్మించిన అంజన్న ఉద్యమంలో అంచలంచలుగా ఎదిగి ఉస్మానియా యూనివర్సిటీ జాయింట్ యాక్షన్ కమిటీ చైర్మన్ గా బాధ్యతలు సంపూర్ణంగా విజయవంతం చేశాడని, నిస్వార్థపరుడైన ఇంత గొప్ప ఉద్యమ నాయకుడిని సన్మానించడం అదృష్టంగా భావిస్తున్నాను అని అన్నారు. అంతకుముందు తెలంగాణ రాష్ట్ర ఉద్యమ నిరుద్యోగ కళాకారుల సంఘం రాష్ట్ర నాయకులు ప్రస్తావించిన విషయాలపై స్పందిస్తూ తప్పనిసరిగా నేను శాసనసభలో నిరుద్యోగులకు ఉద్యోగాలు వచ్చే విధంగా మాట్లాడతానని ప్రభుత్వం పై వత్తిడి తెస్తానని అన్నారు, ప్రభుత్వం దగ్గర ఉన్న





720 మంది లిస్టులో అందరికీ ఉద్యోగాలు వచ్చే విధంగా నేను ప్రతిపక్షంగా కోరుతానని అన్నారు.

### తెలంగాణ ఉద్యమంలో దరువు అంజన్న త్యాగం గొప్పది

తెలంగాణ ధూంధాం వ్యవస్థాపకులు అంతడుపుల నాగరాజు మాట్లాడుతూ తెలంగాణ ఉద్యమంలో దరువు అంజన్న నిస్వార్థంగా ముందుండి ఉద్యమాన్ని నడిపించారని ఉస్మానియా ఉద్యమంలో ఎనలేని కృషి చేశారని తెలంగాణ రావడంలో కీలక భూమిక వహించారని అన్నారు, దరువు అంజన్న తో కలిసి నేను కొన్ని వందల ధూమ్ ధామ్ లో పాలుపంచుకున్నానని అంజన్న గానం చేసిన వీరులారా వందనం అనే పాట కండంతరాలు దాటిందని, వీరులారా వందనం ప్రతి ధూంధాంలో తప్పనిసరిగా పాడామని, మా ఉమ్మడి అదిలాబాదు జిల్లా నుండి అవార్డు పొందడం గర్వంగా ఉందని అన్నారు.

### కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలో ఉద్యోగాలు రావడం ఖాయం

గత పది సంవత్సరాలుగా నిరుద్యోగులుగా మేము చేస్తున్నటువంటి ఉద్యమం ఫలించే రోజులు దగ్గర పడ్డాయని, దానికి తార్కాణమే సాంస్కృతిక శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు శాసనసభలో ఉద్యోగాల గురించి ప్రస్తావించడం, అదేవిధంగా తెలంగాణ ప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ అధ్యక్షులు మహేష్ కుమార్ గౌడ్ శాసనమండలిలో అర్హులైన వారికి ఉద్యోగాలు ఇస్తానని హామీ ఇచ్చారు అని వారికి ఎల్లవేళలా రుణపడి ఉంటామని తెలంగాణ ఉద్యమ నిరుద్యోగ కళాకారుల సంఘం రాష్ట్ర నేత అనుమోజ్ వెంకటేశ్ అన్నారు, ఈ సందర్భంగా తెలంగాణ ఉద్యమ నిరుద్యోగ కళాకారుల సంఘం రాష్ట్ర నేత నగరికంటి కిరణ్ మాట్లాడుతూ అనుమోజు వెంకటేష్ సారధ్యంలో గత పది సంవత్సరాలుగా ఎండకు ఎండి వానకు తడిసి ఎన్నో ఉద్యమాలు చేపట్టామని, గత ప్రభుత్వం ఎన్ని నిర్బంధాలు పెట్టినా వాటిని లెక్కచేయకుండా ఉద్యమాలు నడిపామని, మా ఉద్యమాన్ని గుర్తించి కాంగ్రెస్ ప్రభుత్వం మాకు ఉద్యోగాలు ఇస్తానని పేర్కొనడం ఆనందదాయకం అని అన్నారు. ఈ కార్యక్రమంలో సుందిళ్ల రాజన్న, మందమర్రి నరేష్, శశికుమార్ రెడ్డి, సత్యం రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.



# డఫ్ఫోడిల్స్ పాఠశాలలో సావిత్రిబాయి పూలే జయంతి వేడుకలు

**నివాళులర్పించిన డైరెక్టర్ చింతల నరేందర్, ప్రిన్సిపాల్ జుబేధ హుస్సేన్**



**కలంజ్యోతి, నర్సంపేట :** సావిత్రి బాయి పూలే 149వ జయంతి వేడుకల ను నర్సంపేట పట్టణంలో డఫ్ఫోడిల్స్ పాఠశాలలో ఘనంగా నిర్వహించా రు. ఈ సందర్భంగా పూలే చితపటానికి పాఠాశాల డైరెక్టర్ చింతల నరేందర్, ప్రిన్సిపాల్ జుబేధ హుస్సేన్ పూల మాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం వారు మాట్లాడారు. మహిళ ఉపాధ్యాయురాలందరికీ మహిళ ఉపాధ్యాయ దినోత్సవ శుభాకాంక్షలు తెలిపారు. సావిత్రిబాయి పూలే సాధించిన విజయాలను గుర్తుచేశారు. సమాజంలో మహిళలు అన్ని రంగాల్లో రాణించగలరని చాటిచెప్పిన గొప్ప సామాజిక సంఘసేవకురాలని కొనియాడారు. ఆమెను స్ఫూర్తిగా తీసుకొని ప్రతి ఒక్కరూ ముందుకు నడవాలని పిలుపునిచ్చారు. తెలంగాణ ప్రభుత్వం సావిత్రిబాయి పూలే జయంతిని మహిళ ఉపాధ్యాయ దినోత్సవంగా ప్రకటించడం హర్షనీయమన్నారు. ఈ ప్రకటన మహిళ ఉపాధ్యాయురాలందరినీ గొప్పగా సన్మానించినట్లేనని హర్షం వ్యక్తం చేశారు. అనంతరం ప్రముఖ మ్యాజిక్ కళాకారుడు రుద్రారపు నారాయణతో షో నిర్వహించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు, విద్యార్థులు, పాల్గొన్నారు.



# సావిత్రిబాయిపూలేకు సమగ్ర శిక్ష ఉద్యోగుల నివాళి

**కలంజ్యోతి, నిర్మల్ :** 25 రోజులుగా సమ్మె కొనసాగిస్తున్న సమగ్ర శిక్ష ఉద్యోగులు సామాజిక విప్లవకారిణి, మహిళా సాధికారతకు ప్రతీక , సావిత్రిబాయి పూలే జయంతి సందర్భంగా ఆమెకు ఘనంగా నివాళులు అర్పించారు. తొలి మహిళా ఉపాధ్యాయిని సావిత్రీ బాయి పూలే జయంతిని అధికారికంగా నిర్వహిస్తున్న ప్రభుత్వం విద్యాశాఖలో సేవలందిస్తున్న ఉద్యోగుల సమస్యలు పరిష్కరించటం లేదన్నారు. ఇప్పటికైనా రాష్ట్ర ముఖ్యమంత్రి స్పందించి వెంటనే అందరిని రెగ్యులర్ చేయాలనీ నిరసన కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో నిర్మల్ జిల్లా సమగ్ర శిక్ష ఉద్యోగ సంఘ సభ్యులు గంగాధర్, రాజారత్నం, అనసూయ, సల్మాన్ నాయక్, నవత, సాయినాథ్, శ్యామ్, అపర్ణ, గీతరాణి, పుష్పలత, లక్ష్మి, రవి, ఆనంద్ తదితర సమగ్ర శిక్ష ఉద్యోగులు పాల్గొన్నారు.

# ఘనంగా అడ్వకేట్ కమలాకర్ జన్మదిన వేడుకలు

**కలంజ్యోతి, కుత్బుల్లాపూర్ :**
**బీఆర్ఎస్ పార్టీ సీనియర్ నాయకులు అడ్వకేట్ కమలాకర్ పుట్టినరోజు సందర్భంగా తన నివాసం వద్ద మర్యాదపూర్వకంగా కలిసి జన్మదిన శుభాకాంక్షలు తెలియజేసిన బీఆర్ఎస్ పార్టీ బీసీ సెల్ ప్రధాన కార్యదర్శి చెట్ల వెంకటేష్, శ్రీ పంచముఖ ఆంజనేయ స్వామి దేవాలయ ప్రధాన అర్చకులు పరమేష్ పంతులు, మహేందర్ రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.**







# జాతరకు ఏర్పాటు పూర్తి చేయాలి

## ఎమ్మెల్యే కెపి.వివేకానంద్

### 17 నుంచి శ్రీచిత్తారమ్మదేవి జాతర స్వర్ణోత్సవాలు



**కలంజ్యోతి, కుత్బుల్లాపూర్ :**

గాజులరామారం డివిజన్ శ్రీచిత్తారమ్మా దేవి ఆలయంలో ఈనెల 17వ తేదీ నుండి 25వ తేదీ వరకు నిర్వహించనున్న జాతర స్వర్ణోత్సవ వేడుకల ఏర్పాట్లపై ఎమ్మెల్యే కెపి.వివేకానంద్ అధ్యక్షతన ఆలయ కమిటీ సభ్యులు, వివిధ శాఖల అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ కోరిన కొర్కెలు తీర్చే కొంగు బంగారంగా భక్తులతో పూజలందుకుంటున్న శ్రీచిత్తారమ్మ దేవి జాతరకు ప్రతీ ఏటా హైదరాబాద్ నగరంలోని నలుమూలల నుంచి పెద్దసంఖ్యలో భక్తులు ఇక్కడికి వస్తారన్నారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో మాజీ సీఎం కేసీఆర్ మార్గదర్శకత్వంలో గ్రామ దేవతల జాతరలకు పెద్దపీట వేస్తూ రాష్ట్రవ్యాప్తంగా జాతరలు నిర్వహించామన్నారు. ఇందులో భాగంగానే మేడారం సమ్మక్క సారక్క జాతర, నాగోబా జాతరలకు జాతీయ స్థాయి గుర్తింపు తెచ్చిన ఘనత బీఆర్ఎస్ ప్రభుత్వానిదన్నారు. ఈ సంవత్సరం నిర్వహించే



చిత్తారమ్మదేవి జాతర ప్రత్యేకమన్నారు. స్వర్ణోత్సవ వేడుకలలో ముఖ్యంగా జాతర నిర్వహించే ఆదివారం భక్తులు అధిక సంఖ్యలో హాజరవుతారన్నారు. భక్తులకు ఎటువంటి అసౌకర్యం కలగకుండా ఆర్టీసీ బస్సుల ఏర్పాటు, తాగునీటి సౌకర్యం, లైటింగ్ ఏర్పాటు, టెంపరరీ టాయిలెట్లు వంటి సదుపాయాలను ఏర్పాటుచేసి జాతరను విజయవంతం చేయాలని అధికారులను ఆదేశించారు. అంతకముందు ఆలయ కమిటీ సభ్యులు, పురోహితులు ఎమ్మెల్యేకి పూర్ణకుంభంతో ఘన స్వాగతం పలికారు. చిత్తారమ్మదేవిని దర్శించుకున్న ఎమ్మెల్యే కేపీ అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం ఆలయ కమిటీ సభ్యులు ఎమ్మెల్యేని శాలువాతో ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో కార్పొరేటర్ మంత్రి సత్యనారాయణ, దేవాలయ చైర్మన్ కూన అంతయ్యగౌడ్, మున్సిపల్ ఉపకమిషనర్ మల్లారెడ్డి, జీడిమెట్ల ఆర్టీసీ డిపో మేనేజర్ ఆంజనేయులు, ట్రాఫిక్ సీఐ శ్రీనివాస్, జీహెచ్ఎంసీ ఈఈ కిష్టప్ప, ఎస్ఐ ప్రేమ్ సాగర్, వివిధ శాఖల అధికారులు తదితరులు పాల్గొన్నారు.




### స్త్రీలకు విద్యను నేర్పిన గొప్ప వ్యక్తి

# సావిత్రిబాయి పూలే

**కలంజ్యోతి, కుత్బుల్లాపూర్ :** భారతదేశ మొట్టమొదటి ఉపాధ్యాయురాలు, సంఘ సంస్కర్త సావిత్రిబాయి పూలే జయంతి సందర్భంగా శుక్రవారం సీపీఐ, మహిళా సమాఖ్య ఆధ్వర్యంలో నివాళులర్పించారు. ఈ కార్యక్రమాలకు సీపీఐ శాఖ కార్యదర్శి వెంకటేష్, మహిళా సమాఖ్య జిల్లా అధ్యక్షురాలు హైమవతి నాయకత్వం వహించగా నియోజకవర్గ కార్యదర్శి ఉమా మహేష్ ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లడారు. మనుధర్మ శాస్త్రం ప్రకారం స్త్రీలు కూడా శూద్రులేనని, శూద్రులకు విద్య నిషేధమని అందుకే నాటి సమాజంలో స్త్రీలకు విద్య అందలేదన్నారు. సావిత్రిబాయి పూలేకి మహాత్మా జ్యోతిభా పూలే విద్యను నేర్పించడం వల్ల ఆమె విద్యను అభ్యసించిందన్నారు. విద్య ద్వారా చైతన్యం, జ్ఞానం కలిగి సమానత్వం పొందుతారని, తనతో పాటు మహిళలందరూ చదవాలనే ఉద్దేశంతో ఆమె పోరాటం ప్రారంభిందన్నారు. ఆమె పోరాట ఫలితమే ఈ రోజు మహిళలు అన్ని రంగాల్లో రాణిస్తున్నారని గుర్తుచేశారు. కార్యక్రమంలో సీపీఐ కార్యవర్గ సభ్యులు హరినాథ్, ప్రజానాట్యమండలి అధ్యక్షుడు ప్రవీణ్, ఉపాధ్యక్షుడు రాములు, మహిళా సమాఖ్య నాయకులు అనిత, భాగ్యమ్మ, మహేశ్వరి, చంద్రకళ, గోవిందమ్మ, రేణుక, నిర్మల, లియోనా, కృష్ణవేణి, సరిత, నాయకులు బాబు, శ్రీకాంత్, రాజు, స్వామి పాల్గొన్నారు.

# గొప్ప మానవతా మూర్తి పూలే

## పర్యావరణ ప్రేమికుడు

## కోల రవీందర్ ముదిరాజ్

**కలంజ్యోతి, కుత్బుల్లాపూర్ :**

సావిత్రిబాయి పూలే జయంతి సందర్భంగా సూరారం కాలనీ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో సావిత్రిబాయి జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా పర్యావరణ ప్రేమికుడు పూల రవీందర్ ముదిరాజ్ హాజరై సావిత్రిబాయి చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం పాఠశాల మహిళా ఉపాధ్యాయులకు సన్మానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జ్యోతిరావు పూలే సావిత్రిబాయి పూలే చేసిన సేవలను కొనియాడారు. విద్యార్థులు మహనీయుల బాటలు నడవాలన్నారు. కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు యాదగిరి ,మల్లికార్జున్, కరుణ, నాగరాజు, సత్యనారాయణ, మహేష్, పుణ్యవతి, రమణి ,రవికుమార్, రక్షిత, లక్ష్మణ్, చంద్రశేఖర్, వెంకట్రావు, మాధవి, సంపూర్ణ, ప్రాథమిక పాఠశాల ప్రధానోపాధ్యాయులు వెంకటేష్ ,తదితరులు పాల్గొన్నారు.





# ఢిల్లీలో కమ్ముకున్న పొగమంచు

## ఆలస్యంగా నడుస్తున్న వంద విమానాలు, 24 రైళ్లు

**కలంజ్యోతి, న్యూ ఢిల్లీ:**

దేశరాజధాని ఢిల్లీలో చలితీవ్రత తీవ్ర ప్రభావం చూపుతుంది. శుక్రవారం ఉదయం దట్టమైన పొగమంచు కమ్ముకోవడంతో వంద విమానాలు, 24 రైళ్లు ఆలస్యంగా నడిచాయి. ఈ చలికాలంలో ఢిల్లీలో ఇంతపెద్ద యెత్తున దట్టమైన పొగమంచు కమ్ముకోవడం ఇది మూడోసారి. ఉదయం పూట రోడ్లు కనిపించక ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు తప్పడం లేదు. దీంతో ఎక్కడి వాహనాలు అక్కడే నిలిపివేయాల్సి వస్తుంది. జాతీయ రహదారులపై లైట్లు వేసుకొని ప్రయాణిస్తున్నారు. ఉదయం 11 గంటల వరకు రూడ్లపై పెద్దగా వాహనాలు కనిపించడం లేదు. దృశ్యమానత భారీగా తగ్గడంతో ప్రజలు అప్రమత్తంగా ఉండాలని ప్రభుత్వం సూచించింది.

# కలంజ్యోతి



## విలనిజం చూపించేందుకు సిద్ధమైన ఉదయభాను

బుల్లితెర యాంకర్లు ఎంతో మంది వెండితెరపై తమ అదృష్టాన్ని పరీక్షించుకున్నారు. ఈ జాబితాలో సుమ, ఝాన్సీ, రష్మి, శిల్పా చక్రవర్తి, అనసూయ ఇలా ఎంతో మంది ఉన్నారు. వీరిలో ఉదయభాను కూడా ఒకరు. తొలి నుంచీ కూడా ఉదయభాను టాలీవుడ్ పై ఫోకస్ చేస్తూనే ఉంది. సరైన పాత్రలు మాత్రం ఆమెకు రాలేదు. దీంతో, ఆమె ఐటెం సాంగ్స్ కూడా చేసింది. తాజాగా మరో యాంగిల్ ను చూపించేందుకు ఉదయభాను రెడీ అవుతోంది. విలన్ గా సత్తా చాటేందుకు భాను సిద్ధమయింది. సత్యరాజ్ ప్రధాన పాత్ర పోషిస్తున్న 'బార్బరిక్' సినిమాలో ఉదయభాను విలనిజం చూపించబోతోందట. ఈ చిత్రానికి శ్రీవత్స దర్శకత్వం వహిస్తున్నారు. పాన్ ఇండియా స్థాయిలో ఈ సినిమా విడుదల కానుందట.